భగత్ సింగ్ విప్లవ మార్పుకు సంకేతం



తొర్రూరు , సెప్టెంబర్ 25 వాయిస్ టుడే : అతిచిన్న వయసులోనే భారతదేశ దాస్యశృంఖలాలను తెంచడానికి తన నిండు జీవితాన్ని అంకితం ఇచ్చిన షహీద్ భగత్ సింగ్ ఒక విప్లవ మార్పుకు సంకేతమని ఉపాధ్యాయ దర్శిని ఎడిటోరియల్ బోర్డు సభ్యులు సూరం ఉపేందర్ రెడ్డి, టియుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, ఏఐపికేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. షహీద్ భగత్సింగ్ 119 వ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా సభలు, సమావేశాలు జరపాలని రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా నేడు తోరూరులోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శుక్రవారం పివైఎల్ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ధరావత్ సంతోష్ కుమార్ అధ్యక్షతన భగత్సింగ్ 119 వ జయంతిసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ 23 సంవత్సరాల చిరుప్రాయంలోనే రవి అస్తమించని బ్రిటి సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. తన చదువు జీవితం సమస్తం దేశ సేవకే అంకితం అని సగర్వంగా చాటి చెప్పాడని అట్టడుగు వర్గాల ప్రజలలో ఐక్యత కోసం కృషి చేశాడని అన్నారు. తనను ఉరి తీసే ముందు చివరి కోరిక ఏమిటని అడిగితే తెల్ల బద్మాషుల పాలనే కాదు నల్ల దోపిడీని సైతం అంతం చేయటానికి మళ్లీ జన్మ అంటూ ఉంటే ఇక్కడే పుట్టి పోరాటం చేస్తానని ఉరికంభం ముందు వేలాడుతూ చెప్పిన మాటలు యావత్ యువతరానికి ఒక దేశభక్తియుత సంకేతం అని అన్నారు. మతం పేరుతో దోపిడీ కులం పేరుతో విభజన ప్రాంతాల పేరుతో వివక్షతకు వ్యతిరేకంగా పరిణితి చెందిన రచనలు అనేకం చేశాడని గుర్తు చేశారు. భగత్ సింగ్ జపం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం భారతదేశ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ఓట్ చోరీకి పాల్పడుతుందని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేష్ కుమార్ బిజెపి పార్టీ ఏజెంట్ గా మారి భారత రాజ్యాంగం ఇచ్చిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎలక్షన్ కమిషన్ విలువను ధ్వంసం చేశాడని అన్నారు. 12 కోట్ల ఓటర్లను తొలగించి భారతదేశంలో ఒక నాజీ పరిపాలన కోసం ఆర్ఎస్ఎస్ పాచికలో పావుల జ్ఞానేష్ కుమార్ మారాడని అన్నారు. నిరుద్యోగం పేదరికం వలసలు ఆకలి చావులు ఈ దేశ ప్రజలను పట్టిపీడిస్తున్నాయని వీటికి వ్యతిరేకంగా నిలకడగలిగిన వర్గ పోరాటాలను అభివృద్ధి చేయటానికి భగత్ సింగ్ ఇచ్చిన స్ఫూర్తి నేటి యువతకు దిక్సూచి లాంటిదని అన్నారు. కుహనా దేశభక్తులు రాజ్యమేలుతున్న నేటి తరుణంలో నిజమైన దేశభక్తికి నిలువెత్తు నిదర్శనమని భగత్ సింగ్ ను కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అశేష ప్రజానీకాన్ని దోచుకోవటంపై ఐక్య పోరాటాలను తీవ్రతరం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు ఊడుగుల రాములు, టియుసిఐ జిల్లా నాయకులు చింతా నవీన్, పాడియ బీకు , మల్లికంటి వెంకన్న, గుండాల సోమనరసయ్య బొమ్మరబోయిన కుమార్ ,అనిల్ ,సురేష్ ,ధర్మయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.



అసైన్డ్ భూములపై సీఎం నిర్ణయానికి కృతజ్ఞతలు

అర్హులైన దళితులకు భూములు పంపిణీ చేయాలి

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

హనుమకొండ, సెప్టెంబర్ 25 (వాయిస్ టుడే): అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, అర్హులైన దళితులకు భూములు పంపిణీ చేయాలనే నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మాదిగ హక్కుల దండోరా, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు కీలకమని రామకృష్ణ పేర్కొన్నారు.

పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలి..

దళితుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన అసలు హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అన్యాయంగా ఇతరుల పేర్లకు మారినట్లు నిర్ధారణ అయితే, సంబంధిత భూములను అసలు హక్కుదారులకు తిరిగి అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అసైన్‌మెంట్ యాక్ట్--1977 ప్రకారం మార్జిన్ లోన్లను పునరుద్ధరించాలని కోరారు. దళితుల భూ హక్కులు, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం చేపట్టే చర్యలకు మద్దతు ఉంటుందని రాజేందర్ సురేష్ బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో చుంచు రాజేందర్, మాదాసు సురేష్, మన్నే బాబూరావు, రామచందర్, కేదేల ప్రసాద్, స్వామి, మందవీరస్వామి, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు లేక
మహిళా ప్రయాణికుల అవస్థలు

దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేయని మరుగుదొడ్లు.. జాడలేని తాగునీరు





దంతాలపల్లి, సెప్టెంబర్ 25 (వాయిస్ టుడే): మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు మరుగుదొడ్ల సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆర్టీసీ బస్టాండ్ గతంలో కొంతకాలం నిరుపయోగంగా ఉండగా, గత రెండేళ్లుగా బస్సుల రాకపోకలు పెరగడంతో ప్రయాణికుల రద్దీ కూడా పెరిగింది. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు మాత్రం మెరుగుపడలేదని స్థానికులు చెబుతున్నారు. పనిచేయని మరుగుదొడ్లు: బస్టాండ్‌లోని మరుగుదొడ్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా మరుగుదొడ్లను వినియోగించుకోలేని పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కరువు: బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుబాటులో తాగునీటి సౌకర్యం లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తాగునీటి కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొంటున్నారు.

సరిపోని కుర్చీలు: బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో సీటింగ్ సౌకర్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్‌లో తక్షణమే తాత్కాలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులను కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, సీటింగ్ తదితర సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్ర నిధులు, కీలక సంస్థల ఏర్పాటుపై సీఎంకు కడియం కావ్య వినతి

పీఎం-ఉషా నిధులు, పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు

NIELIT, CITD, PSK ఏర్పాటుకు విజ్ఞప్తి



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 25 (వాయిస్ టుడే):లి వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించి కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు, వరంగల్ కోటలోని పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.10 కోట్లు, వరంగల్‌లో NIELIT, CITD కేంద్రాలతో పాటు పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (ఆఖా) ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు త్వరగా మంజూరయ్యేలా, పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి నిధులు సమకూరేలా కేంద్రంతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త మ్యూజియం భవనంలో కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర సదుపాయాల కోసం నిధులు అవసరమని వివరించారు.

యువతకు సాంకేతిక శిక్షణ.. ప్రజలకు మెరుగైన సేవలు

వరంగల్‌లో NIELIT కేంద్రం ఏర్పాటు చేస్తే ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ రంగాల్లో యువతకు శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని, CITD ద్వారా జూాణ/జూావీ, జచీజ మిషనింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణతో పాటు స్థానిక పరిశ్రమలకు సాంకేతిక సహకారం లభిస్తుందని ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఉన్న POPSK స్థానంలో పూర్తిస్థాయి ఖూాఖ ఏర్పాటు చేస్తే వరంగల్-హనుమకొండ-కాజీపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు పాస్‌పోర్ట్ సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చినట్లు కడియం కావ్య తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా సీఎంను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



వైద్యశాఖలో ఫార్మసిస్టుల సేవలు కీలకం

ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు

తొర్రూరు, సెప్టెంబర్ 25 వాయిస్ టుడే : వైద్య,ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల సేవలు కీలకమని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆసుపత్రి వైద్యులు శుక్రవారం సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు కె.జ్యోతి, పారుపెల్లి మహేశ్వర్, ఆర్.బి.ఎస్.కె ఫార్మసీ ఆఫీసర్ ఎన్.నిర్మల లను శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మందులు, ఔషధ భద్రత, సరైన మందుల వినియోగం మరియు రోగుల కౌన్సిలింగ్ లో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరిండెంటెంట్ లు ఝాన్సీ రాణి, ప్రమీల, జూనియర్ అనాలిస్టు ఆమ్రపాలి, వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ గిరి ప్రసాద్, డాక్టర్ శంకర్, డాక్టర్ అనిల్, డాక్టర్ జ్వలిత, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ నందనా దేవి, డాక్టర్ మానస,ఫార్మసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హనుమకొండ, సెప్టెంబర్ 25 (వాయిస్ టుడే): పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం 2వ డివిజన్ గుండ్లసింగారంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మాదాసి దయాకర్--సుజాత దంపతులకు నిర్మించిన నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం..

ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు దయాకర్--సుజాత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గడిపి జీవన్, వంగపహాడ్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, డివిజన్ ప్రధాన కార్యదర్శి వంశీ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్ట రవి మాదిగకు పరామర్శ

కాజీపేట, సెప్టెంబర్ 25(వాయిస్ టుడే): ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి మాదిగను మాదిగ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆయన తల్లి పుట్ట రాజమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రవిని ఓదార్చారు. అనంతరం రాజమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం నాయకులు సినపెల్లి కొంరయ్య, పసునూరి మనోహర్, గుర్రం యాదగిరి, పరం జ్యోతి, డాక్టర్ ప్రభాకర్, సందెల విజయ్ కుమార్, కటుకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పీసీఎంఈకి మజ్దూర్ నాయకుల అభినందనలు

కాజీపేట, సెప్టెంబర్ 25 (వాయిస్ టుడే):లి నూతనంగా నియమితులైన పీసీఎంఈ విజయ్‌కుమార్‌ను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కామ్రేడ్ కె.శ్రీనివాస్, డీఎల్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వేదప్రకాశ్, కోశాధికారి కామ్రేడ్ రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శి కామ్రేడ్ నరేష్ యాదవ్‌లు ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు పీసీఎంఈ విజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైల్వే ఉద్యోగుల సంక్షేమం కోసం స్నేహపూర్వక సంబంధాలు, నిర్మాణాత్మక సహకారంతో ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు.